సాక్షి
గుంటూరు
గురువారం । 30 । మార్చి । 2023



రేపు లాంఫాం శతాబ్ది ఉత్సవాలు

గుంటూరు రూరల్: లాంఫాం వంద సంవత్సరాల వేడుకలను శుక్రవారం నిర్వహించనున్నట్లు లాంఫాం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.సుబ్బారావు తెలిపారు.



దర్గా ఆదాయం రూ.19.06లక్షలు

పెదకాకాని: బాజీబాబా దర్గా హుండీ ఆదాయం ఐదు నెలల కాలానికి రూ.19,06,195 లభించిందని దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా తెలిపారు. మంగళ, బుధవారాల్లో లెక్కింపు జరిగింది.

రెంటచింతల @ 41.8 డిగ్రీలు

రెంటచింతల: రెంటచింతలలో బుధవారం గరిష్ట ఉష్ణోగ్రత 41.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27.4 డిగ్రీలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మూడు రోజులుగా 41 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో గ్రామస్తులు అల్లాడుతున్నారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
గుంటూరు	6:25	4:47
నరసరావుపేట	6:27	4:46
బాపట్ల	6:25	4:47

రాములోరి పెళ్లి.. చూతము రండి

- ద్విశతాబ్ది కల్యాణోత్సవానికి ముస్తాబైన యనమదల సీతారామస్వామి ఆలయం
- 1824 నుంచి నిర్విరామంగా కోదండ రామయ్య కల్యాణోత్సవం

దశావతారాల్లో రామావతారం చాలా విశేషమైనది.. ఆదర్శనీయమైనది. చైత్రమాసం, శుద్ధ నవమి నాడు అభిజిత్ లగ్నంలో సీతమ్మతో రామయ్యకు జరిగిన కల్యాణం జగత్కల్యాణమై విరాజిల్లింది. ఎప్పుడో త్రేతాయుగంలో జరిగిన ఈ కల్యాణం యుగాలు మారినా.. తరాలు మారినా.. ప్రతిఏటా వాడవాడలా చలువ పందిళ్లు వేసి... వైభవంగా చిన్నా, పెద్దా అంతా ఒకటై కల్యాణం నిర్వహిస్తున్నారు. నడినెత్తిన సూరీడు ప్రతాపం చూపిస్తున్నా, వడగాడ్పులు ఓ పట్టాన కుదురుగా కూర్చోనివ్వకున్నా, ఎవరూ బొట్టుపెట్టి పిలవకున్నా స్వామి కల్యాణానికి వెళ్లి, తనివితీరా దర్శించి ఆఖరున పానకం, వడపప్పులను భక్తిగా స్వీకరించడం ప్రతిచోటా జరుగుతోంది. 'సిరి కల్యాణపు బొట్టును పెట్టి, మణిభాసికమును నుదుటను కట్టి, పారాణిని పాదాలకు పెట్టి, పెండ్లికూతురై వెలసిన సీతమ్మను చూడటానికి, సంపెగ నూనెను కురులను దువ్వి, సొంపుగ కస్తూరి నామమ దీర్చి, చెంపజవాజి చుక్కను బెట్టి, పెండ్లికొడుకై వెలసిన రాముని కల్యాణము చూతము రారండి' అంటూ నాటి కల్యాణ గీతిక అందర్నీ పరుగు పరుగున పందిళ్లకు రప్పిస్తోంది. అలాంటి పర్వదినం శ్రీరామనవమి నేడు. అందుకే తెలుగు లోగిళ్లలో ఇవాల్టికీ అచ్చువేసే వివాహ శుభలేఖలలో ప్రథమ స్థానం ('జానక్యాః కమలామలాంజలి పుటే యాః పద్మరాగయితాః..') ఈ సీతారాములదే. ఈ మహత్తర కల్యాణ వేడుకకు పల్లెల నుంచి నగరాల వరకు సిద్ధమయ్యాయి. తాటాకు పందిళ్లలో.. మధ్యాహ్నం అభిజిత్ లగ్న వేళ సీతారాములను ఒక్కటి చేసి తరించేందుకు అంతా సిద్ధం అయ్యారు.



దివ్య అలంకరణలో ఉత్సవమూర్తులు (ఫైల్)

యనమదల (ప్రత్తిపాడు): రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన యనమదలలో కొలువుదీరిన కోదండ రాముడు 200వ కల్యాణోత్సవానికి ముస్తాబయ్యాడు. తాటాకు పందిళ్లు, వేదపండితుల మంత్రోచ్చారణలు, భాజాభజంత్రీల నడుమ గత కొన్ని దశాబ్దాలుగా నవమి వేడుకలను 1824 నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ట్రస్టీలు, గ్రామస్తులు, అధికారులు, అర్చకుల సమష్టి కృషితో ప్రతి ఏటా ఇక్కడ రాములోరి కల్యాణం వైభవోపేతంగా జరుగుతుంది.



కల్యాణోత్సవాలకు సిద్ధమైన యనమదలలోని సీతారామస్వామి దేవాలయం

రెండవ భద్రాద్రిగా పేరు..

యనమదల సీతారామస్వామి దేవాలయానికి రెండవ భద్రాద్రిగా నానుడి. భద్రాచలంలోని రామాలయంలో ఉన్న మాదిరిగానే స్వామి వార్ల చెంత అమ్మవారిని ఏకశిలలో నిర్మాణం జరిగిన దేవాలయం ఇది (భద్రాచలంలో మాదిరిగానే ఈ దేవాలయంలోనూ స్వామి వారి కాలిపై అమ్మవారు కూర్చుని ఉంటుంది). అందుచేతనే ఈదేవాలయాన్ని చిన్న భద్రాద్రి గానూ, రెండవ భద్రాద్రి గానూ పిలుస్తుంటారని గ్రామస్తులు చెబుతున్నారు.

సప్త సముద్రాల జలాలతో...

గోదావరి, కృష్ణా, కావేరి, తుంగభద్ర, నర్మద నదుల నుంచి నదీ జలాలు, సప్త సముద్రాల నుంచి నీరు, రామేశ్వరం నుంచి ఏడు బావుల నీరు, మానస సరోవరం నుంచి నీరు, అమరనాథుని సన్నిధి నుంచి తెప్పించిన రకరకాల జలాలతో కల్యాణ మహోత్సవం మర్నాడు శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని రమణీయంగా జరపనుండటం మరో ప్రత్యేకత.

అచ్చం అక్కడిలానే కల్యాణోత్సవం ..

భద్రాద్రిలో నిర్వహించిన విధంగానే స్వామి వారి కల్యాణ ఉత్సవాలు జరపడంతో పాటు, కల్యాణం అనంతరం జరిపే పదహారు రోజుల పండుగ వరకు అత్యంత నియమ నిష్టలతో స్వామివారికి పూజలు జరుగుతాయి. ఉత్సవాలు ప్రారంభమైన నాటినుంచి ముగిసే వరకు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకలను నిర్వహిస్తారు. నవమి రోజున కల్యాణమహోత్సవం మరునాడు గ్రామస్తులు అందరూ కనుల పండుగగా స్వామి వారి శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేకం, రథోత్సవం నిర్వహిస్తారు.

గుంటూరులో ఆలయాలు ముస్తాబు

పాత గుంటూరు: శ్రీ రామ నవమి వేడుకలకు నగరంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకించి ఆలయాల ముందు వేసిన పందిళ్లు ఆకట్టుకున్నాయి. పూలదండలు, విద్యుద్దీప కాంతులతో ఆలయాలను సుందరంగా అలంకరించారు. పాత గుంటూరులోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, పార్క్ సెంటర్‌లోని రాముల వారి దేవాలయం, కొత్తపేటలోని ఆంజనేయస్వామి దేవాలయం, బ్రాడీపేట వీరాంజనేయస్వామి ఆలయం, ఏటీ అగ్రహారం రెండోలైనులోని ఆంజనేయస్వామి ఆలయం, స్తంభాలగరువులోని రామాలయం, కంకరగుంట గేటు వద్ద ఆంజనేయస్వామి దేవాలయం, నగరంపాలెంలోని ఆంజనేయస్వామి దేవాలయం తదితర ఆలయాలలో కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



గుంటూరు కొరిటెపాడు రెడ్లబజారు వద్ద ఏర్పాటు చేసిన పందిళ్లు

సర్వాంగ సుందరంగా రామాలయాలు..

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని రామాలయాలు సర్వాంగ సుందరంగా దర్శనమిస్తున్నాయి. యనమదలలోని శ్రీసీతారామ స్వామి దేవాలయం విద్యుత్ దీపాలతో ధగధగా మెరిసిపోతుంది. అదేవిధంగా నియోజకవర్గ కేంద్రంలోని రెడ్ల రామాలయంతో పాటు పలు దేవాలయాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. కల్యాణోత్సావాన్ని పురస్కరించుకుని దేవాలయాల ముంగిట చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. రామయ్య పెళ్లికి ఊరంతా సందడి సందడిగా మారాయి. బంధవులు రాక, పండుగ శోభ, తిరునాళ్ల సందడి, గ్రామోత్సవాల వైభవంతో ఊరు ఊరంతా కల్యాణ వీణ మోగుతుంది.

న్యూస్‌రీల్

గంజాయి నివారణకు పటిష్ట చర్యలు

జూమ్ ద్వారా గుంటూరు, బాపట్ల, ప్రకాశం ఎస్పీలతో మాట్లాడిన గుంటూరు ఐజీ




నగరంపాలెం: గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని ఎన్‌డీపీఎస్, నాటుసారా, బెల్లం ఊట కేసుల్లో పదే పదే నేరాలు చేస్తూ పట్టుబడిన వారిని గుర్తించి, వారిపై పీడీ చట్టం నమోదుకు ప్రతిపాదనలు పంపించాలని గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమవర్మ ఆదేశించారు. గుంటూరు నగరంలోని రేంజ్ కార్యాలయం నుంచి బుధవారం గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ గంజాయి నివారణకు ప్రతి జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా గంజాయి క్రయ విక్రయాలతోపాటు తాగే వారిని కూడా నియంత్రించాలని ఆదేశించారు. గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్, ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికగార్గ్, మూడు జిల్లాల డీఎస్పీలు హాజరయ్యారు.

నాగార్జునకొండను సందర్శించిన శ్రీలంక బౌద్ధులు




విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను బుధవారం 32 మంది శ్రీలంక బౌద్ధమతస్తుల బృందం సందర్శించింది. స్థానిక లాంచీస్టేషన్ నుంచి నాగసిరి లాంచీలో నాగార్జునకొండకు వెళ్లిన శ్రీలంకేయులు నాగార్జునకొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధుని ప్రతిమలు, మట్టి కుండలు, రాతి పనిముట్లు, 9 అడుగుల బుద్ధుడి పాలరాతి విగ్రహం, అశ్వమేధ యాగశాల, మహాస్థూపం, స్నానాల గట్టును తిలకించారు. నాగార్జున కొండను సందర్శించడం ఆనందంగా ఉందని బౌద్ధులు తెలిపారు.

1,20,059 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,15,161 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,20,059 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,200 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 82,824 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.5,200, మోడల్ ధర రూ.4, 400 వరకు పలికింది.

దళితులపై దాడుల పేరుతో రామోజీ అసత్య ప్రచారం

- మంత్రి మేరుగ నాగార్జున
- చంద్రబాబు హయాంలో దళితులపై లెక్కలేనన్ని దాడులు
- దళితుల భూములు లాక్కున్న రామోజీ..
- మార్గదర్శి పేరుతో ప్రజల సొమ్ము కాజేసిన వైనం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో సాంఘిక సంక్షేమ శాఖలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి సాధిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వినుకొండలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా నాడు- నేడు పథకంలో ఎస్సీ హాస్టల్ భవనాలను సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఫేజ్ 1, 2, 3లలో రెసిడెన్షియల్ స్కూల్స్ కూడా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు హయాంలో దశలవారీగా ఎస్సీ హాస్టల్ భవనాలు మూత పడినట్లు పేర్కొన్నారు. ఎస్సీ గురుకులాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పి చంద్రబాబు హాస్టల్ భవనాలు మూసి వేశారన్నారు.

దళితులపై దాడుల పేరుతో రామోజీ అసత్య ప్రచారాలు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో దళితులపై దాడులు జరుగుతున్నాయని, దళితులకు రక్షణ లేదని ఈనాడు రామోజీరావు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. 14 ఏళ్ల చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు జరిగాయని తెలిపారు. అమలాపురం, విశాఖ, తిరుపతి, కుప్పం, కర్నూలు జిల్లాల్లో లెక్కలేనని దాడులు జరిగాయన్నారు. అప్పట్లో ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా ఉన్న తనకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఘటనలపై అవగాహన ఉందన్నారు. అప్పుడు రామోజీ ఎందుకు వార్తలు రాయలేదని ప్రశ్నించారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో దళితులు భూములు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. మార్గదర్శి పేరుతో ప్రజల సొమ్ముకు లెక్కలు చూపకుండా కాజేశారన్నారు. తమ ప్రభుత్వం జరిగిన దాడులపై వెంటనే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చంద్రబాబు హయాంలో దళితుల సంక్షేమానికి రూ.36 వేల కోట్లు ఖర్చు చేస్తే తమ ప్రభుత్వం కేవలం మూడున్నరేళ్లలో రూ.51 వేల కోట్లు నేరుగా పేదవారికి అందించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి రెక్కల కష్టంతో గెలిచిన ఎమ్మెల్యేలు కొందరు పార్టీకి ద్రోహం చేశారని, వారికి రాజకీయ భవిష్యత్తు లేదన్నారు. 40 మంది ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని చెబుతున్న అచ్చెన్నాయుడు కూడా టీడీపీని నమ్మే స్థితిలో లేరన్నారు.

ఏసీబీకి చిక్కిన గ్రామ సర్వేయర్

రైతు నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

కర్లపాలెం: భూమి సర్వే రిపోర్టు ఇచ్చేందుకు ఓ గ్రామ సర్వేయర్ రైతు వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ టీవీవీ ప్రతాప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... దుండివారిపాలెం సచివాలయ గ్రామ సర్వేయర్‌గా కె.సీతాహేమంత్ పనిచేస్తున్నాడు. ఇతను యాజలి గ్రామ ఇన్‌చార్జి సర్వేయర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చెందిన వెంకయ్యకు కర్లపాలెం మండలం యాజలి రెవెన్యూ పరిధిలో వ్యవసాయ భూములు ఉన్నాయి. వెంకయ్య ఈనెల 21వ తేదీన తమ భూమి సర్వేచేసి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా గ్రామ సర్వేయర్ సీతా హేమంత్ ఈనెల 24వ తేదీన సదరు భూమికి సర్వే నిర్వహించారు. అయితే సర్వే ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు సీతాహేమంత్ వెంకయ్యను రూ.26వేలు లంచం డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వటం ఇష్టంలేని వెంకయ్య ఏసీబీ అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు బుధవారం దుండివారిపాలెం గ్రామ సచివాలయంలో ఉన్న సర్వేయర్ సీతాహేమంత్‌కు రూ.26వేలు నగదు లంచంగా ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈసందర్భంగా ఏసీబీ డీఎస్పీ టీవీవీ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే తమకు కాని, 14400 యాప్ ద్వారా కాని, స్పందన కాల్ సెంటర్‌కు కాని ఫోన్‌చేసి ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సబ్ ఇన్‌స్పెక్టర్లు రవిబాబు, నాగరాజు, అంజిబాబు, మన్మథరావు, ఎస్ఐ శ్రీనివాసమూర్తి ఉన్నారు.



నగదుతో గ్రామ సర్వేయర్ సీతాహేమంత్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- పసుమర్రు వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



పసుమర్రు లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేటలోని పసుమర్రు వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ ఉన్నతాధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. థర్డ్ ఆప్షన్ కింద నిర్మిస్తున్న నిర్మాణాల పరిస్థితి ఏమిటని హౌసింగ్ అధికారులను ప్రశ్నించారు. దీనికి వారు సమాధానం చెబుతూ థర్డ్ ఆప్షన్ కింద 1376 గృహాలు వివిధ దశల్లో నిర్మాణం జరుపుకుంటున్నాయని తెలిపారు. థర్డ్ ఆప్షన్ గృహాలు ఎప్పటిలోగా పూర్తి చేస్తారని మంత్రి, జేఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధిని ప్రశ్నించగా ఆరు నెలల్లోగా పూర్తి చేస్తామని సమాధానమిచ్చారు. లేఅవుట్‌లో మొత్తం ఇళ్ల నిర్మాణాల పరిస్థితి ఏమిటని గృహ నిర్మాణ అధికారులను ప్రశ్నించారు. అర్బన్‌కు సంబంధించి మొత్తం 3,022 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పసుమర్రు లేఅవుట్‌లో రికార్డు స్థాయిలో 7,865 మందికి గృహాలు నిర్మించి ఇవ్వాల్సిన బృహత్తర కార్యక్రమం మనందరిపై ఉందని చెప్పారు. దీనికోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాల్సిఉంటుందన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తిచేసేందుకు పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్లులేని నిరుపేదలందరికీ ఇళ్ల నిర్మాణాలు చేయించి ఇచ్చే విషయంలో ఎంతో ఆసక్తి కలిగిఉన్నారని, సీఎం ఆశయాల మేరకు అధికారులు నడుచుకోవాలని పేర్కొన్నారు. పసుమర్రు లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే ఒక కొత్త ఊరు వెలుస్తుందని వెల్లడించారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందజేస్తోందని చెప్పారు. స్వయం సహాయ సంఘాల సభ్యులకు అదనంగా రూ.35 వేలు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని చెప్పారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎస్.వేణుగోపాలరావు, ఈఈ బి.శివలింగం, డీఈఈ ఎస్.వెంకట్రావు, పబ్లిక్ హెల్త్ డీఈఈ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, 16వ వార్డు కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఇనుప చట్రాల కింద నలిగిన ప్రేమ

పెద్దల ఆంక్షలనే ఇనుప చట్రాల కింద మరో ప్రేమ జంట నలిగిపోయింది. మనసిచ్చి పుచ్చుకుని.. ఊసులు చెప్పకొని.. భవిష్యత్తు గురించి ఎన్నో బాసలు చేసుకున్న ఆ ప్రేమజంట పెద్దలను ఒప్పించలేక.. విడిపోయి బతకలేక.. రైలు పట్టాలపై తల పెట్టి.. తమ జ్ఞాపకాలను తలపోసుకుంటూ.. కన్నీరు నిండిన కళ్లతో ఒకరినొకరు కడసారి చూసుకుంటూ మృత్యువును ఆహ్వానించారు.

- రైలు కింద పడి ప్రేమజంట ఆత్మహత్య
- పెద్దలు పెళ్లికి ఒప్పుకోకపోవడంతో అఘాయిత్యం
- శలపాడు గ్రామానికి చెందిన ఇరువురు మృతితో కుటుంబాల్లో విషాదం




ఉయ్యూరు శ్రీకాంత్ (ఫైల్), పులి త్రివేణి (ఫైల్)



రైల్వే ట్రాక్ వద్ద గ్రామస్తులు

శలపాడు(చేబ్రోలు): క్షణికావేశంలో ప్రేమజంట తీసుకున్న తొందరపాటు నిర్ణయం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపిన సంఘటన చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని శలపాడు గ్రామానికి చెందిన ఉయ్యూరు శ్రీకాంత్ (20), పులి త్రివేణి(19)లు బుధవారం సంగం జాగర్లమూడి స్టేషన్ పరిధిలోని సుద్దపల్లి గ్రామ పరిధిలోని రైల్వే గేట్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. మృతులు ఇరువురు శలపాడు గ్రామానికి చెందిన ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. వీరు రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇరుపక్షాల పెద్దలు తమ ప్రేమను అంగీకరించకపోవటంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. పిల్లి త్రివేణి సోమవారం అదృశ్యం కావటంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెనాలిలోని ఏఎస్ఎన్ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్న త్రివేణి సోమవారం కళాశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. ఇదే ప్రాంతానికి చెందిన ఉయ్యూరు శ్రీకాంత్‌తో కలిసి వెళ్లినట్లు త్రివేణి తల్లిదండ్రులకు ఆమె స్నేహితురాలు చెప్పటంతో వీరి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఐటీఐ వరకు చదివిన శ్రీకాంత్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీకాంత్ పది రోజుల క్రితం ఇంటి నుంచి కొంత నగదు తీసుకొని వెళ్లినట్లు సమాచారం. ఇరువురు శ్రీశైలం, తిరుపతి వెళ్లి ఉంటారని అనుమానించారు. అయితే బుధవారం ఉదయం సుద్దపల్లి రైల్వేగేటు వద్ద మృతదేహాలను రైల్వే గ్యాంగ్‌మెన్ గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గుంటూరు – తెనాలి రైలు మార్గంలో ట్రాక్‌పై ఇరువురు మృతదేహాలు ఛిద్రమై గుర్తు పట్టలేని విధంగా శరీర భాగాలు ముక్కలుగా తెగిపడిపోయాయి. త్రివేణి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతురాలు తమ కుమార్తె అని గుర్తించి కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. తెనాలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమజంట ఆత్మహత్యతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఖరీఫ్‌కు ప్రొసీడ్'

- అవసరమైన విత్తనాలు సిద్ధం చేయాలి
- వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయం జేడీఏ కృపాదాస్



మాట్లాడుతున్న కృపాదాస్, వేదికపై వెంకటేశ్వర్లు, సుజాత తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): వచ్చే ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మిరప, వరి, పంటల సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, ఆ మేరకు విత్తనాలను సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయం సీడ్స్ జేడీఏ వి.డి.వి.కృపాదాస్ విత్తన కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం విత్తన కంపెనీల ప్రతినిధులు, పంపిణీదారులతో స్థానిక కృషీ భవన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ కోసం బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు 4 లక్షలు, మిరప విత్తనాలు 13 లక్షల ప్యాకెట్లు ఒక్కోటి 10 గ్రాముల చొప్పున సరఫరా చేసేందుకు కంపెనీలు, పంపిణీదారులు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృపాదాస్ మాట్లాడుతూ విత్తన ప్యాకెట్లను లైసెన్స్ కలిగిన డీలర్ల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. 450 గ్రాముల బీటీ-2 పత్తి విత్తనాల ప్యాకెట్ ధరను కేంద్రం రూ.853 ప్రకటించిందని, ఈ ధరకు మించి అమ్మకాలు జరగకుండా కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విత్తనాలకు ఎటువంటి కొరత లేకుండా కంపెనీలు ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించి సిద్ధం చేయాలని సూచించారు. విత్తనాల్లో నాణ్యత లోపం లేకుండా లాట్ వారీగా వైఎస్సార్ అగ్రి ల్యాబుల్లో పరీక్షలు చేయించాలని, వాటి ఫలితాలను తమకు అందజేయాలని పేర్కొన్నారు.

30వేల హెక్టార్లలో పత్తి సాగుకు అవకాశం

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ 2023-24 గాను 30 వేల హెక్టార్లలో పత్తి, 27,500 హెక్టార్లలో మిరప పంట సాగు చేసేందుకు అవకాశం ఉందని, దీనికి సంబంధించి జిల్లాలో మండలాలు, రైతు భరోసా కేంద్రాల వారీగా అవసరమైన విత్తనాల కోసం సమగ్ర ప్రణాళిక తయారు చేశామని వెల్లడించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో అన్ని ప్రముఖ కంపెనీల పత్తి, మిరప విత్తనాలను 20 శాతం ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచనున్నామని, దీనికోసం ఏపీ సీడ్స్ అన్ని కంపెనీలతో అవగాహన ఒప్పందాలను ఇప్పటికే చేసుకుందని వివరించారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి ఎస్.సుజాత, డీడీఏ రామాంజనేయులు, జిల్లా మేనేజర్ జి.సుబ్బయ్య పాల్గొన్నారు.

భూకబ్జాల నాని.. నోరు అదుపులో పెట్టుకో!



వివరాలు వెల్లడిస్తున్న కార్పొరేటర్ ఆచారి

పట్నంబజారు: టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోవెలమూడి రవీంద్రనాథ్ అలియాస్ భూకబ్జా నాని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌పై పిచ్చిపట్టిన వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని 32వ డివిజన్ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) హెచ్చరించారు.బృందావన్‌గార్డెన్స్‌లోని ఎమ్మెల్యే గిరి కార్యాలయంలో బుధవారం పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే గిరికి టీడీపీ నేతలు ఫోన్ కాల్స్ చేశారని స్పష్టంగా నిరూపించటం జరిగిందన్నారు. టీడీపీ సెంట్రల్ కార్యాలయం నుంచి జనార్ధన్ ఫోన్ చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 34వ డివిజన్ కార్పొరేటర్ బూసి రాజలత మాట్లాడుతూ కోవెలమూడి నాని అంటేనే అలియాస్ దందాలు..సెటిల్‌మెంట్‌లు, బంకు., భూకబ్జాలనే విషయం ప్రతి ఒక్కరని తెలుసన్నారు. కాకాని రోడ్డులో భూకబ్జా, పేకాట క్లబ్ నిర్వహించటం, పెట్రోలు, డీజిల్ తగ్గించి వాహనాల్లో కొట్టించటం నానికి పరిపాటేనని విమర్శించారు.

నియోజకవర్గంలో రూ.140 కోట్లతో అభివృద్ధి పనులు జరిగితే... రూ.3 కోట్లు డివిజన్ అభివృద్ధికి కేటాయించటం జరిగిందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణాలు జరిగినప్పుడు కళ్లు కనిపించకుండాపోయయా అని విమర్శించారు. యూజీడీ పనులకు సంబంధించి రూ.400 కోట్లు కమిషన్‌లు టీడీపీ నేతలు గుంటూరును గుంతలమయంగా మార్చేస్తే.. వాటిని తిరిగి పూడ్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రెండేళ్లు పట్టిందన్నారు. చంద్రబాబుకు ఆత్మలాంటి వ్యక్తి జనార్ధన్ ఫోన్ చేసింది సాక్ష్యాధారాలతో నిరూపించామని, అసలు ఆయన ఎమ్మెల్యే గిరికి ఎందుకు ఫోన్ చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. 28 డివిజన్ కార్పొరేటర్ రోషన్ మాట్లాడుతూ ప్రజల్లో కనీస విలువలు లేని వ్యక్తి కోవెలమూడి నాని అని, అటువంటి వ్యక్తి ఎమ్మెల్యే గిరిపై వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకట రమణ, తేలుకుట్ల యోగేశ్వరరావు, కె. గురవయ్య, సాధు ఉమామహేశ్వరి, అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, అందుగుల సంతోష్, గోపి శ్రీనివాస్, ఉడుముల లక్ష్మి, షేక్ జుమ్మాజీ, మార్కెట్‌బాబు, యక్కలూరి మారుతి, బోపాటి ఉషారాణి, మల్లిబోయిన శ్రీవల్లి, డివిజన్ ఇన్‌చార్జీలు టీఎల్‌వీ వీరాంజనేయులు, ఆనం సంజీవ రెడ్డి, బోగిసం ప్రసాద్, మందాల కోటిరెడ్డి పాల్గొన్నారు.

రక్తహీనత తగ్గించేందుకు కృషి చేయాలి

కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: చిన్నారులు, గర్భిణులు, మహిళల్లో రక్తహీనత కారణంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వీటిని తగ్గించేందుకు మరింత కృషి అవసరమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టర్ బంగ్లా నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్ మాట్లాడుతూ 10 నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న పాఠశాల విద్యార్థులతో పాటు బయట ఉన్న పిల్లలకు నూరు శాతం రక్తపరీక్షలు నిర్వహించాలని చెప్పారు. రక్తహీనత అధికంగా ఉన్నవారిని గుర్తించి వారికి ఫ్యామిలీ డాక్టర్ విధానంతోపాటు విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. పీహెచ్‌సీలతోపాటు అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది దీనిపై నిరంతర దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 104 వాహనాలు 17 ఉన్నాయని కొత్తగా వచ్చిన నాలుగుతో కలిపి 21 వాహనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వీటి సేవలు అవసరం మేరకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతుల పొలాలను వివరంగా, పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. రబీకి అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అవసరం మేరకు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పాడిపశువుల కొనుగోలుకు నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈవీఎం గోడౌన్లను పరిశీలించిన డీఆర్వో

బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్లను డీఆర్వో చంద్రశేఖరరావు, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పరిశీలించారు. సీసీ కెమేరాలతోపాటు, బాక్సులను, రిజిస్టర్స్‌ను, సెక్యూరిటీని పరిశీలించారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మార్చి 2న అర్బన్ పీహెచ్‌సీలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు తెలిపారు. కాంట్రాక్టు ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్స్, స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టును బుధవారం విడుదల చేస్తున్నామన్నారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే మెడికల్ ఆఫీసర్స్ ఏప్రిల్ 3లోగా, స్టాఫ్‌నర్సులు ఏప్రిల్ 5లోగా లిఖిత పూర్వకంగా తగు ధృవపత్రాలతో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ప్రొవిజనల్ మెరిట్‌లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

స్పెషలిస్టు వైద్యుల మెరిట్ లిస్టు

టెలిమెడిసిన్ హబ్‌లో స్పెషలిస్టు డాక్టర్స్, మెడికల్ ఆఫీసర్స్ ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరైన వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును బుధవారం విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు తెలిపారు. మెరిట్ లిస్టులో అభ్యంతరాలు ఉంటే ఏప్రిల్ 3తేదీ సాయంత్రం 4 గంటల్లోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

పారామెడికల్ ఉద్యోగాల ప్రొవిజనల్ మెరిట్‌లిస్ట్


నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం ద్వారా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మార్చి2న పారామెడికల్ ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరైన వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును బుధవారం విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు తెలిపారు. మెడికల్ ఆఫీసర్, జనరల్ ఫిజీషియన్, డెంటల్ టెక్నీషియన్, సోషల్ వర్కర్, సైకాలజిస్టు, మల్టీరిహాబిలిటేషన్ వర్కర్, ఆడియో మెట్రీషియన్, న్యూట్రీషియన్ కౌన్సిలర్, ఫిజియోథెరఫిస్టు, స్టాఫ్‌నర్సు, హాస్పటల్ అటెండెంట్, శానిటరీ అటెండెంట్, అటెండర్, క్లీనర్, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

నిడమర్రులో మిర్చి టిక్కీల చోరీ

రైతులు అడ్డుకోవడంతో ద్విచక్ర వాహనం వదిలి పరారైన గుర్తు తెలియని వ్యక్తి

మంగళగిరి: నగర పరిధిలోని నిడమర్రు పంట పొలాల్లో ఆరబోసిన మిర్చిని గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బాధితుల కథనం ప్రకారం.. పలువురు రైతులు మిర్చి పంటను కోసి కల్లాల్లో ఆరబోశారు. అయితే రాత్రి వేళల్లో రైతులు కాపలాగా ఉన్నా అర్ధరాత్రి దాటిన తరువాత రైతులు నిద్రపోయిన సమయంలో గత నాలుగు రోజులుగా పలు కల్లాల్లో ఆరబోసిన మిర్చిని గోతాల్లోకి నింపుకుని దోచుకు వెళుతున్నారు. నిడమర్రుకు చెందిన తాడిబోయిన మోహనరావు పొలంలోని 16 టిక్కీల మిర్చిని, ఉయ్యూరు మధుసూదనరెడ్డికి చెందిన నాలుగు మిర్చి టిక్కీలతో పాటు మరో ఇద్దరు రైతులకు చెందిన మిర్చి టిక్కీలను గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. మంగళవారం రాత్రి కల్లాల్లో మిర్చిని దుండగులు టిక్కీలకు నింపి ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా రైతులు గమనించి వెంబడించడంతో దుండగులు ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయారు. రైతులు బుధవారం మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వినూత్న ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలి



సాంకేతిక సమ్మేళనం లోగోను ఆవిష్కరిస్తున్న అతిథులు

నరసరావుపేట ఈస్ట్: సమాజానికి ఉపయోగపడే వస్తుసేవల ఆవిష్కరణలపై ఇంజినీరింగ్ విద్యార్థులు దృష్టిపెట్టాలని జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ బి.బాలకృష్ణ తెలిపారు. జేఎన్‌టీయూ-ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మేక్సెల్-2023 జాతీయస్థాయి సాంకేతిక సమ్మేళనం నిర్వహించారు.

సమ్మేళనాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ బాలకృష్ణ మాట్లాడుతూ జేఎన్‌టీయూలో మెకానికల్ ఇంజినీరింగ్ చదివిన పూర్వ విద్యార్థులు నేడు పలు రంగాలలో ఉన్నతస్థానంలో ఉన్నారని తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకొని నేటితరం విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఎదగాలని ఆకాంక్షించారు.

ఇంజినీరింగ్ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు డిజైన్ థింకింగ్ అలవరచుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని సెల్‌ఫోన్ కాలక్షేపంతో వృథా చేసుకోరాదని హితవు పలికారు. సమ్మేళనం లోగోను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్ఫిగ్లోబ్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు శ్రీచైతన్య, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు, మెకానికల్ విభాగాధిపతి ఐ.శ్రీఫణిసుష్మ, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు బాలాజీనాయక్, డాక్టర్ జి.సులోచన, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు ఉజ్వల్‌భరత్, శంకర్‌సూర్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జంట హత్యల కేసులో నిందితుడికి యావజ్జీవం

గుంటూరు లీగల్: జంట హత్యల కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు ముద్దాయి కోనూరు శ్రీనివాస చక్రవర్తి బెల్లకొండ మండలం నందిరాజుపాలెం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఫిర్యాది కోనూరు లక్ష్మీనారాయణ సత్తెనపల్లి పట్టణంలోని నాగార్జుననగర్‌లో నివాసం ఉంటున్నాడు. కోనూరు లక్ష్మీనారాయణ తండ్రి శివప్రసాదరావుకు సంబంధించిన పొలంలో తమకు వాట ఉందనీ, తమ భాగం తమకు ఇవ్వాలని ముద్దాయి కోనూరు శ్రీనివాస చక్రవర్తి, ఫిర్యాది కోనూరు లక్ష్మీనారాయణతో తరచూ ఘర్షణ పడేవాడు. ఈ క్రమంలో 2021 ఆగస్టు 28న సాయంత్రం లక్ష్మీనారాయణ ఇంట్లో లేదని తెలుసుకుని శ్రీనివాస చక్రవర్తి ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న లక్ష్మీనారాయణ తల్లి కోనూరు పద్మావతి, చెల్లెలు మనప్రగడ ప్రత్యూషతో ఘర్షణకు దిగాడు. అనంతరం తన దగ్గర ఉన్న కత్తిని తీసి పద్మావతిని విచక్షణారహితంగా పొడిచాడు. అడ్డుకునేందుకు నాలుగు నెలల గర్భవతి అయిన ప్రత్యూష వెళ్లగా ఆమెను కూడా కత్తితో క్రూరంగా పొడిచాడు. దీంతో ఇద్దరూ మృతి చెందారు. తల్లి, చెల్లి హత్యపై లక్ష్మీనారాయణ సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు అనంతరం అప్పటి సీఐ యు.శోభన్‌బాబు చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు విచారణలో సాక్ష్యాధారాలతో నేరం రుజువుకావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున జిల్లా కోర్టు పీపీ మహమ్మద్ సుల్తాన్ సిరాజుద్దీన్ వాదించారు.

ముగిసిన ఇంటర్ 'ప్రధాన' పరీక్షల పర్వం

మొత్తం 26 మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు



చివరి పరీక్ష రాసి వస్తున్న సెకండియర్ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఘట్టం ముగిసింది. బుధవారం సీనియర్ ఇంటర్ ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు ముగియడంతో ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. గత నెల 15న పరీక్షలు ప్రారంభమైనది మొదలు జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా అధికార యంత్రాంగం సమర్థవంతంగా నిర్వహించింది. బుధవారం జరిగిన కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ పేపర్-2 పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాల పరిధిలో కేటాయించిన 44,780 మంది విద్యార్థుల్లో 43,532 మంది విద్యార్థులు హాజరయ్యారు. అదేవిధంగా బుధవారం నాలుగు మాల్ ప్రాక్టీసు కేసులు నమోదయ్యాయి. కాగా పరీక్షలు జరిగిన రోజుల్లో మొత్తం 26 మంది విద్యార్థులపై అధికారులు మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు చేశారు.

3న విజనరీ జగన్, డిజిటల్ లైబ్రరీస్‌పై అవగాహన సదస్సు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఎన్‌యూ వీసీ ఆచార్య రాజశేఖర్, మందపాటి శేషగిరిరావు

ఏఎన్‌యూ(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఏప్రిల్ మూడో తేదీన 'విజనరీ జగన్, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీస్' అంశంపై అవగాహన సదస్సు జరుగుతుందని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. ఆయన బుధవారం ఏఎన్‌యూలో వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌ను కలిశారు. సదస్సు నిర్వహణపై వీసీతో చర్చించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ ఏఎన్‌యూలో ఏప్రిల్ మూడో తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజనరీ జగన్, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీస్‌పై అవగాహన సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. డిజిటల్ లైబ్రరీలకు అద్యులైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్య సాధనకోసం ఈ ఉగాది నుంచి ఈ తెలుగు సంవత్సరానికి 'జగన్ డిజిటల్ శోభకృత్ నామ సంవత్సరం'గా ఏపీ గ్రంథాలయ పరిషత్ నామకరణం చేసిందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలలో డిజిటల్ లైబ్రరీల ఆవశ్యకతను వివరిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏఎన్‌యూలో జరిగే సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా, ఏఎన్‌యూ వీసీ ఆచార్య రాజశేఖర్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సలహాదారు చల్లా మధుసూధన్ రెడ్డి, యూనివర్సిటీ ఇంజినీరింగ్ డీన్ ఆచార్య ఇ.శ్రీనివాస్ రెడ్డి, ఆచార్య విద్యాసాగర్ హాజరవుతారని తెలిపారు. ఏఎన్‌యూ వీసీ పి.రాజశేఖర్ మాట్లాడుతూ సదస్సుకు యూనివర్సిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సదస్సు బ్రోచర్‌ను వీసీ, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ ఇంజినీరింగ్ డీన్ ఆచార్య ఇ.శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధికి రూ.9.21 లక్షల విరాళాలు



ఎమ్మెల్సీ జంగా, శివస్వామికి విరాళం అందజేస్తున్న కౌన్సిలర్ వెంకట్రామయ్య

దాచేపల్లి: గామాలపాడు గ్రామ సమీపంలో నాయకురాలు నాగమ్మ నిర్మించిన శివాలయం అభివృద్ధికి బుధవారం దాతలు రూ.9.21 లక్షల విరాళాలు ప్రకటించారు. ఈ దేవాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ రూ.50,116, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి రూ1,01,116, దాచేపల్లి నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య రూ,1,01,116, మాశెట్టి బుజ్జి, మాశెట్టి పుల్లారావు రూ.1,01,116, హైదరాబాద్‌కు చెందిన కోవిడ్ సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జి.అనూహ్యారెడ్డి రూ.1,01,116, సర్పంచ్ జంగా సురేష్ రూ.50,116, 13వ వార్డు కౌన్సిలర్లు వందనపు వెంకట్రామయ్య రూ.50,116, పిడుగురాళ్లకు చెందిన శ్రీనివాసరావు రూ.50,116, దాచేపల్లికి చెందిన కుందురు తిరుపతి రెడ్డి, పానాది వెంకటనారాయణ, ముత్యాలంపాడుకు చెందిన ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, గామాలపాడుకు చెందిన మంచి గురవారావు, పిడుగురాళ్లకు చెందిన రామకృష్ణ, ఇరికేపల్లికి చెందిన తాటిపర్తి పకీరారెడ్డి ఒక్కొక్కరూ రూ.25 వేల చొప్పున కలిపి మొత్తం రూ.9.21 లక్షలు విరాళాలు ప్రకటించారు. రూ.25 లక్షలు విలువ చేసే మరకత లింగం తమ పీఠం ద్వారా తీసుకువస్తామని శివస్వామి చెప్పారు. శివాలయం జీర్ణోద్ధరణకు ప్రజలు సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

విపత్తుల నిర్వహణపై శిక్షణ



తాడేపల్లిరూరల్: మంగళగిరి ఆరో బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి విపత్తుల సమయంలో, ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాలుగు మండలాల రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆరో బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ రక్షణ చర్యలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి నీటిలో మునిగినప్పుడు అతడిని రక్షించి శ్వాసను ఏ విధంగా అందించాలి, ఎవరైనా నీటిలో మునిగిపోతున్నప్పుడు వారిని ఎలా కాపాడాలి అనే అంశాలపై కృష్ణానదిలో భవాని ఐలాండ్ వద్ద ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాడేపల్లి తహశీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి, మంగళగిరి తహసీల్దార్ రామ్ ప్రసన్న, తుళ్ళూరు, తాడికొండ, కొల్లిపర్ర తహశీల్దార్లు, మంగళగిరి నియోజకవర్గంలో సీఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఐలు, వీఆర్వోలు, ఆపద మిత్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.